# కాముని పున్నమి

అప్పటికి అమ్మా, నాన్నా ఇంకా నిద్రలేవలేదు. గోపాలంమాత్రం నిద్రలేచాడు. మెల్లిగా తలుపు తీసికొని దొడ్డివాకిలిదగ్గర నిలబడ్డాడు. చలిగాలి. తెరలు తెరలుగా వీస్తోంది. పొన్నాయిచెట్టునిండా పూలు, విరగబడి నవ్వుతున్నాయి. పొన్నాయిపూలంటే రాధకు ఎంతో ఇష్టం. వీటికోసం పడిచచ్చిపోయేది. తెల్లవారుజామునే చెట్టుకిందకు చేరేది రాధ.

రాధ చెప్పిందాకా, పొన్నాయిపూలలో అంత అందమున్న సంగతి తనకు తెలిసేదికాదు. ఆ మాటకొస్తే, తను రాధనుంచి చాలాసంగతులు నేర్చుకొన్నాడు.

ఇద్దరూ చెట్టుకింద చేరి, దూరంనించి పూలు ఏరుకొంటూ, మొదటికొచ్చేవారు. రాధ పరికిణీ ముందుచెంగులు బొడ్డుదగ్గర దోపుకొని, సంచిలా తయారుచేసేది. తను ఒక్కొక్కపువ్వు ఏరి, ఆమెఒళ్లో వేసేవాడు. ఎన్నిపూలున్నా రాధకు తనివితీరేదికాదు. చెట్టు చెట్టుతో రాల్చుకెళదామన్నంత తాపత్రయంపడేది.

రాధ మీకెవరికీ తెలిసుండదు. బహుశా చూసి కూడా వుండరు. వూరూ పేరూలేని ఓ పంతులయ్య కూతురును గురించి, పదిమందికి తెలిసిఉంటుందనుకోవడం తప్పే.

ఎప్పుడన్నా తమాషాచేద్దామని, తను పొన్నాయి చెట్టు దగ్గరకే వెళ్ళేవాడుకాదు. రాధ చాలాసేపు కిటికీ

దగ్గర అటూఇటూ తచ్చాడుతుండేది. చిన్నగా కూని రాగాలు తీసేది. చిన్న చిన్న మంటిబెడ్డలు విరిచి, కిటికీకేసి విసిరేది. తను ఇవన్నీ దుప్పటిసందులోంచి గమనిస్తూనేఉండే వాడు. అయినా తమాషాకోసం గనుక, గమనించిగూడా వెళ్ళేవాడు కాదు.

ఎప్పుడన్నా నిద్రపట్టి ప్రొద్దెక్కిలేచాక వెడితే, ఎక్కడపూలక్కడే ఉండేవి. వాటినిచూసి, తను బాధపడే వాడు. నిజాని కా పూలన్నీ ఈపాటికి, రాధ ఒంకులజడలో దాగుని, కులుకుతూ ఉండవలసింది. తన మొండితనంవల్ల, ఇలా మట్టిలోపడి దొర్లుతున్నాయి. ఏ మధ్యాహ్నమో కని పించినప్పుడు అడిగితే రాధనోంఅంతట సమాధానం చెప్పేది కాదు. అమ్మగూడా దొడ్డిలోనిపూలన్నీ యథాతథంగా ఉండటంచూసి రాధ రాలేదనే రూఢి చేసుకొనేది.

మీకెవ్వరికీ రాధ తెలిసుండదు. బహుశా చూసి గూడా ఉండరు, రాధ ఎంతబాగా పాడుతుందని. ఎన్ని పాటలు వచ్చునని.

మామిడితోపులోకెళ్ళి సాయంత్రందాకా, అక్కడే ఉండిపోయిన సందర్భాలు చాలాఉన్నాయి. మామిడిపిందె లంటే రాధ కాట్టే ఇష్టంలేదు. తనుమాత్రం—వాటికోసం పడి చచ్చిపోయేవాడు. కేవలం తనకోసమే రాధకూడా వచ్చేది. కిందవరసకాయలు తెంపుకోమని సలహాఇచ్చేది రాధ. చెట్లెక్కడమంటే—ఎందుకో రాధకు భయం. తనె క్కుతున్నా వద్దువద్దని వారించేది. అత్తయ్యతో చెబుతా ననేది. నాన్నతో చెప్పి తొడపాశం పెట్టిస్తాననేది.

రాధకు కోపమొస్తే ఎంత బాగుంటుందని. కళ్ళు మాటిమాటికి టపటపలాడించేది. చిన్నమూతిని వంకరగా తిప్పి బిగించేది. పెదిమలమధ్య చిక్కుపడిన నవ్వు, వాటి వ త్తిడికి గిలగిలలాడిపోయేది. తన కెంతుకో — రాధకు, పదే పదే కోపం తెప్పించాలన్న దిక్కుమాలిన సరదా ఇంతకద్దు ఉండేది. గోలచేస్తున్నా వినిపించుకోకుండా తను, మామిడి కొమ్మల్లోకి మాయమయిపొయ్యేవాడు. గండుచీమలు పట్టి పీకుతున్నా లక్ష్యపెట్టేవాడు కాదు. కొమ్మలమీంచి వూగుతూ, పిందెలూ, పూలూ, తెట్టలు తెట్టలుగా రాల్చి పారేసేవాడు.

"ఇక దిగిరారా గోపీ" అని గోలపెడుతుండేది రాధ. ఎప్పటికోగాని తను వచ్చేవాడుకాదు.

గొబ్బెమ్మలంటే రాధ కెంత ఇష్టమని. అంతకద్దు చీకట్లోనూ లేచి, ఆవుపేడ సంపాదించి ... ముద్దలుచేసి మధ్యలో గుంతలుపొడిచి, అప్పుడు తనకోసం వచ్చేది. శరీరం, గజగజలాడిపోయే ఆ చిరు శీతులో, ఇద్దరూ చెట్టాపట్టా లేసుకొని, గెంతుకుంటూ స్కూలుదగ్గరి కెళ్లేవారు. మొండి గోడలు దూకటం — పూడేరాళ్ళను ఆధారంగా చేసుకోవడం — భయం లేకపోవడం — ఎంత మంచిరోజు లవి. స్కూల్లోఉన్న బంతిపూలూ, చిక్కుడుపూలూ తుంపి తను ఇవతల వేస్తుంటే, హారికంటం చుట్టుకొన్న రాధ, దాన్ని విప్పేసి, పూలతో నింపుకొనేది. తెల్లవారేసరికి, రెండు వాకిళ్ళముందూ, రకరకాల ఆకారాలతో గొబ్బెమ్మలు తీర్చిదిద్దిఉండేవి.

పద్మవ్యూహం ముగ్గంటే రాధకెంత ఆపేక్షని. అమ్మ నడిగి ఎన్నోసార్లు ఆ ముగ్గు వేయించుకొంది. తనూ వేసింది. కానీ వేసినప్రతిసారీ ఎక్కడో తప్పిపోతూనే ఉండేది. ఆ ముగ్గు వేశాక నోసారి వ్యూహంలోకి వెళ్ళి తిరిగిరావాలట. లేకపోతే దోషమట.

చూపుడువేలును సుతారంగా చూపి, ముగ్గుచారల మధ్యగా, వేలు నడుపుతూ, కేంద్రందాకా వెళ్ళగలిగేది రాధ. కానీ, తిరిగిరావడం చాతయ్యేదికాదు. అదే అప్పటికీ ఇప్పటికీ రాధ జీవితంలోని మలుపు.

రెండేళ్ళ తరువాత, తనో పనికిమాలిన డిగ్రీ పుచ్చుకొని ఇంటికొచ్చాడు.

ఈ రెండేళ్ళలో రాధ ఎంత మారిపోయిందో. తనే చప్పున పోల్చుకోలేకపోయాడు. పరికిణీలూ, వోణీలూ మానేసి, చీరె కట్టింది. చెక్కిళ్ళలో కొత్తనేవళం మోసు లెత్తింది. కళ్ళు విశాలంగా ఎదిగాయి. వీపుమీదుగా పమిట తిప్పుకొని,ఒంటినిండా కప్పేసుకుంది తన్నుచూసి. కాళ్ళకు సన్నని పాంజేబుపట్టీలు మిలమిలలాడుతున్నాయి. దమ్మిడీ కాసంత సాదుబొట్టు, కుడి కనిబొమ్మమీదికి, జరిగి, నల్లని తోకచుక్కలా కనిపిస్తోంది.

తనను చూడంగానే సిగ్గుతో లేచి, గబగబా లోపలి కెళ్ళిపోయింది. ఎవరో తను ఊహించడానికిగూడా ప్రయత్నించలేదు. అమ్మ చెప్పిందాకా, తను రాధను పోల్చుకోలేకపోయాడు. అమ్మ తాను ప్రతిజాబులోనూ, రాధను గురించి వ్రాస్తూనేఉండేది. తనుమాత్రం, తన ఉత్తరాల్లో

రాసినగుర్తు లేదు. వో కవరుమాత్రం వోసారి రాసినట్టు జ్ఞాపకం. అయినా ఏమనిరాశాడుగనుక. నాలుగు పున్నాయిపూలు పెట్టి 'జ్ఞాపకార్థం' అని వో చీటీపడేసి పోస్టుచేశాడు.

ఆరోజుసాయంత్రం తను డాబామీద చిరిచాప వేసుకొని వెల్లకిలా పడుకొన్నాడు. పొన్నాయిచెట్టు చెప్పే కబుర్లు వింటూ తలూపుతోంది. చిన్ననాటిసంగతులన్నీ గుండెల్లో మెదిలి, శరీరం జలదరించినట్లయింది. ఎంత కమ్మని కాల మది. ఎంతమంచి వయస్సు. దేనికీ ఎప్పుడూ భయముండేదికాదు. ఇప్పుడలా చీకట్లో తను లేవనూ లేదు. లేచినా పూలు పడనూ లేదు. ఆ వయస్సుతోబాటే, ఆ ఉత్సాహమూ, ఉద్వేగమూకూడా మాసిపోతాయేమో ?

ఏదోవాసన తనను మేలుకొలిపినట్లయింది. తిరిగి చూస్తే, చక్కగా తల్లో పూలు తురుముకొని, కళ్ళనిండా కాటుక దిద్దుకొని, ముఖాన రవ్వపొడి వేసిన కుంకుమబొట్టు పెట్టుకొని, బుగ్గన చిన్న చేర్చుక్క లద్దుకొని రాధ కనిపించింది...

సూర్యుడు, తుమ్మలతోపునిండా కావిరంగు చల్లి, మెల్లిగా పక్కకు తప్పుకొన్నాడు. ఈద్రింత పక్షులు, గోలగా లేచి సద్దుమణిగాయి. కిందినించి, అమ్మ వేస్తున్న తాలింపువాసన—కమ్మగా పైకి పాకి వస్తోంది...చంద్రుడు రామచంద్రయ్యగారి గన్నేరు గుబుర్లలోంచి కళ్ళుతెరిచి చూస్తున్నాడు...

తనేదో మాట్లాడబోయాడు. కానీ, మాటపెగలక ముందే, బాధ తనను రంగుల్లోముంచి లేవనెత్తింది. తనేదో

ముక్కంటే పిట్టగోడనానుకొనే పగలబడి నవ్వుతోంది. ఆ నవ్వు సిద్ధాపంలాంటిది. తనూ రాధను పంచవన్నెల చిలకను చేశాడు ఆ మునిమాపులో...

ఎంత పొద్దుపోయిందో—అమ్మ కేక వేసిందాకా తమ కా సంగతే గుర్తురాలేదు...తను రాధనుచూడటానికి అదే ఆఖరు. మళ్ళీ చూడాలన్నఆశ ఫలించనేలేదు. నిజానికి చూడాలనిగూడా లేదు. తనకుకాకుండా పోయిన వ్యక్తి గురించి ఇంతగా ఆలోచించడం భావ్యంకాదేమో! అయినా —ఇప్పటికీ, రాధ తనసొత్తేనని ఎవరో తన అంతరాంతరాల్లో ఎలుగెత్తి చెబుతున్నట్టుగానే తన కుంటుంది...అవును ఈ రోజునే— సరిగ్గా ఇలాంటి సమయంలోనే, తను రాధను పంచవన్నెల చిలుకను చేశాడు. చిలక తప్పిపోయింది. జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి...ఎవ్వరూ చూడకుండా కళ్ళొత్తుకొన్నాడు గోపాలం.

* * *

పిల్లలిద్దరూ పందిట్లో ఆడుకొంటున్నారు. రమ ఇప్పటికే రంగుల్లో నానిపోయింది. రమకు అచ్చంగా తనపోలికే వచ్చిందని అనుకొంది రాధ. తనకు తన చిన్నతనంలోఉన్న అభిరుచుల్లాంటివే, తనకూతురులోనూ ఉండటం చూసి, అప్పుడప్పుడు భయపడేది రాధ ఏమిఉన్నా, లేకపోయినా, తనరాతమాత్రం పగవారికిగూడా రాగూడదని, అనేకసార్లు, భగవంతుణ్ణి ప్రార్థించింది రాధ.

అయితేగియితే, అన్నీ సక్రమంగాఉంటే, తన వివాహం గోపాలంతో కావలసింది. అలా ఎందుకు కాలేదో తనకు

తెలీదు. కాకపోవడానికి కారణమెవరోకూడా తనకు తెలీదు...

జారిపోయిన ఆ చిన్నతనం మళ్ళీవస్తే గోపాలంతో చేయీ, చేయీ కలిపి, ఉల్లాసంగా గెంతుకుంటూ, అలా మామిడితోపుల్లో తిరగ్గలిగితే, మళ్ళీ పొన్నాయిపూలు ఏరుకోగలిగితే—ఎంత బావుణ్ను. భగవంతుడు, ఎల్ల కాలం తనలాంటివారిని, చిన్నవాళ్ళుగానే ఉంచకూడదూ?

గోపాలం మంచివాడు. అంతకన్నా అతన్నిగురించి తనేమీ చెప్పలేదు. చదువుకోసం పట్నాలు వెళ్ళినన్నాళ్లూ, తనకు పిచ్చెత్తినట్లుండేది—వచ్చిన ప్రతిఉత్తరంలోనూ, తననుగురించి ఏమన్నా రాశాడేమోనని హృదయం ఆతృతతో ఎదురుచూసేది. రాయలేదని తెలిశాక, ఎంతో ఖేదించేది. రాయకపోవడంకూడా మంచిదేమోననిపించేది ఒక్కోసారి. బహుశా ఇది తనను తాను సముదాయించుకొనే ప్రయత్నంలో, ఆత్మపొందే తృప్తేమో...

గోపాలం, అమ్మనూ, నాన్ననూ ఆడిపోసుకుంటాడుగానీ, వాడితప్పేమీ లేదేమో? దరిద్రులంగా పుట్టటమూ, దరిద్రంతోనే జీవించటమూ వారితప్పు కాదు. ఆ దరిద్రమే లేకపోతే, తనపెళ్ళి గోపాలంతోనే జరిగిఉండేది. అసలు కారణాన్ని విడిచిపెట్టి, నీడతో దెబ్బలాడుతున్నాడు గోపాలం.

తనేదో త్యాగం చేయలేదంటాడుగానీ, తనకోసం అత నెందుకు చేయలేకపోయాడుట.

ఆ సాయంత్రం గోపాలాన్ని డాబామీద కలుసు

కొన్నప్పుడు, అదే చివరికలయిక అవుతుందని, తను అనుకో లేదు. అతనితో చాలాసేపు కబుర్లాడుతూ కూచుంది. తేలిన సారాంశమేమంటే అతను, తన్ను చేసుకొంటాట్ట. ఎవరు కాదన్నా వినడుట. హరిహరాదులు అడ్డువచ్చినా తన నిర్ణయానికి తిరుగులేదన్నాడు గోపాలం...

మనిషి పరిస్థితులకు వారసుడనుకొంటే ఎవర్నీ తప్పు పట్టవలసినఅవసరంలేదేమో. కానీ, చాలామందికి, ఈ ఆలోచన రానేరాదు. గోపాలంగూడా ఆ కోవలో చేరతాడు. తనేదో చెయ్యలేదని, వటవటలాడిపోతాడు గానీ—తనకు తానై చేసిందేమిటో చెప్పడు. తప్పంతా ఇంకొకరినెత్తిన వేయడం, మానవస్వభావంలోనే ఉన్నదేమో.

ఏది ఏమయినప్పటికి, ఇంతవరకూ జరిగిందంతా, తన మంచికే జరిగిందేమో మరి? ఇప్పుడు తన అమ్మకూ, నాన్నకూ ఏ దిగులూలేదు. తమ్ముళ్ళిద్దరూ, పెద్దచదువులు చదువుకొంటున్నారు. చెల్లికి మంచిసంబంధంచూసి ఇన్ని అక్షింతలు వేయగలిగింది...ఇవన్నీ గోపాలాన్నిచేసుకొంటే ఉండేవా? అనుమానమే. తన సుఖంసంగతి సరే సరి. తన వల్ల తనవారందరూ సుఖపడటం చాలు. అదొక్కటే తనకు ఎనలేని ఆనందాన్నివ్వగలుగుతుంది.

'రెండవపెళ్ళివాడితో నువ్వేం సుఖపడతా'వని గోపాలం కబురుచేశాడు. బహుశా అతనికి సుఖమంటే ఏమిటో తెలీకపోవచ్చు. తను పొందిందే సుఖమన్న దురభిప్రాయం అతనికున్నా, తను ఆశ్చర్యపోదు. తను సుఖంగా ఉన్నదా లేదా, అన్నప్రశ్న కాదు. తనవల్ల తనవారందరూ

బాగుపడ్డారా లేదా అన్నదే ముఖ్యం. ఈ ప్రశ్నకు తను జవాబు చెప్పుకోగలుగును. తన కదే ఆనందం.

అయినా, ఏ మూలనో గోపాలంనీడలు మెదులుతూనే ఉన్నాయి. ఇంతమందికోసం, తా నెందు కింతగా క్షోభపడటమూ అన్న ఆలోచనలుగూడా తనకు కలిగాయి. ఇప్పుడనుభవిస్తున్నది సుఖం కాదనీ, సుఖమని,—తనను తానే మోసగించుకోవటమనీ, అప్పుడప్పుడు తన కనిపిస్తూ ఉంటుంది. ఒక వేళ ఇదే నిజమేమో? ఇప్పుడు గోపాలం ఏం చేస్తుంటాడో? సరిగ్గా ఇదేరోజున, ఇలాంటి సాయంత్రమే, అతన్ని తను రంగుల్లో ముంచెత్తింది. ఆనా డనుభవించిన ఆనందం, మధురానుభూతి మళ్ళీ తనజీవితంలో తటస్థపడ లేదు. ఆ జ్ఞాపకాలుమాత్రమే తన కిప్పుడు మిగిలాయి.

గదిలోనించి ఖంగుఖంగుమని భర్త దగ్గు వినిపించింది. కన్నీళ్ళొత్తుకొంటూ గదికేసి వెళ్ళింది రాధ.